## క్లుప్తంగా

### రుచికరమైన భోజనం పెట్టాలి



విద్యార్థులకు భోజనాన్ని వడ్డిస్తున్న నిర్వాహకులు

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రభుత్వ పాఠశాల్లో అమలవుతున్న మధ్యాహ్న పథకంలో రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు పెట్టాలని, వంట నిర్వాహకులు నాణ్యమైన భోజనాన్ని అందించాలని కొత్తపాళెం సర్పంచ్ సుబ్బరత్నమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు హరిప్రసాద్ తెలిపారు. వారు బుధవారం కొత్తపాళెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి, విద్యార్థులతో కలసి భోజనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని అందించాలని తెలిపారు. మెనూ ప్రకారం భోజనం పెట్టకపోతే అధికారుల దృష్టికి తీసుకెళ్లి తామని నిర్వాహకులను హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ప్రతిభకు ప్రోత్సాహం



విద్యార్థులకు నగదు అందజేస్తున్న పూర్ణచంద్, రూపేష్‌కుమార్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2023–24వ సంవత్సరం పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు బుధవారం నగదు ప్రోత్సాహకం అందజేశారు. మంచి ప్రతిభ చూపిన నవ్య దేవాంగ, రేష్మ దేవాంగ, సుప్రియకు తెలారివెట్టు గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి పూర్ణచంద్ ఒక్కొక్కరికి రూ.2వేల వంతున హెచ్‌ఎం రూపేష్‌కుమార్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ క్రమశిక్షణతో చదువుకుని తల్లిదండ్రులకు, గురువులకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యువశ్రీమురళి, సురేష్‌బాబు, నాదెండ్ల మురళి, ప్రసాద్, దాసు, మాధవీలత, లక్ష్మయ్య, జగన్నాథం, తదితరులు పాల్గొన్నారు.

### ఉచితంగా నోటు పుస్తకాలు పంపిణీ



నోటు పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంఈఓ రవీంద్రనాథ్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కల్లివెట్టు పంచాయతీ పరిధిలోని మొక్కలలేను గిరిజన కాలనీలోని ప్రాథమిక పాఠశాల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులకు బుధవారం ఎంఈఓ రవీంద్రనాథ్, వైద్యాధికారి దినకర్ నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుత్తూరు గ్రామానికి చెందిన సంజీవ సింహాద్రుస్టు వారు విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. నోటు పుస్తకాలు పంపిణీ చేయడంతో విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. అనంతరం సంజీవ సింహాద్రుస్టు చైర్మన్ వేంకటేశులు మాట్లాడుతూ తాను పేద కుటుంబం నుంచి చదివి పైకి వచ్చానని, చదువు విలువ తెలుసని, అందుకే పేద విద్యార్థులకు తనవంతు సహాయంగా నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఇద్దరికి గాయాలు

ఏర్పేడు: మండలంలోని సీతారాంపేట సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులు కథనం మేరకు.. తిరుపతికి చెందిన సుబ్బారాయులు(43), వెంకటేశ్వర్లు(21) ద్విచక్ర వాహనంపై శ్రీకాళహస్తికి వెళుతుండగా సీతారాంపేట సమీపంలో ముందు వెళుతున్న వాహనాన్ని అధిగమించబోయి అదుపు తప్పడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ గాయాలయ్యాయి. చికిత్స కోసం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### చిలుక వాహనంపై కుమారస్వామి



పురవీధుల్లో ఊరేగుతున్న సుబ్రహ్మణ్యస్వామి

శ్రీకాళహస్తి: విజ్ఞానగిరిపై ఉన్న సుబ్రహ్మణ్యస్వామి ఆడికృత్తిక ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం చిలుక వాహనంపై ఊరేగారు. తొలుత ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు, మేళతాళాల నడుమ స్వామి అమ్మవార్లను చిలుక వాహనంపై కొలువుదీరి, పురవీధుల్లో విహరింపజేశారు. భక్తులు పాల్గొని కర్పూర హారతులు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ ఎస్వీ ఎస్ఎన్ మూర్తి, ఆలయాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గంగ విరామం.. బతుకు విలాపం

'గంగమ్మా..'గంగమ్మా.. నేలతల్లి గొంతు తడారిపోయింది మాడమ్మా.. నీటి జాడ లేక.. నీ సడి కానరాక..నారు ఎండిపోయింది కరుణించమ్మా..పొలాలు నెర్రెలు చాచేస్తుం టే..అన్నదాతలు హడలిపోతుంటే.. ఓసారైనా వచ్చి పలకరించవేంటమ్మా..అని సత్యవేడు నియోజకవర్గంలోని కర్షకులు వేయి కళ్లతో తెలుగుగంగ నీటి కోసం నిరీక్షిస్తున్నారు. గంగ నీరొస్తేనే బతుకు 'సాగు'తోందని అంటున్నారు.

**'గంగ' రాదాయే..బెంగ తీరదాయే!**

- తెలుగు గంగ నీటి కోసం ఎదురుచూపు
- పంట సాగుకు ఆ నీరే ఆధారం

సత్యవేడు: నియోజకవర్గంలోని రైతులు గంగ నీటి కోసం ఎదురు చూస్తున్నారు. కండలేరు జలాశయం నుంచి తమిళనాడుకు గంగ నీటిని విడుదల చేస్తే సత్యవేడు నియోజకవర్గంలోని బుచ్చినాయుడుకండ్రిగ, వరదయ్యపాళెం మండలాల్లో చెరువులకు నీటి వసతి, సత్యవేడు మండలాల్లో కాలువ ద్వారా పంట పొలాలకు నీటి వసతి కలుగుతుందని రైతులు ఆశిస్తున్నారు. గంగ నీటిపై ఆధారపడి 1376 హెక్టార్లలో వరి, వేరుశనగ, సజ్జ పంటలు సాగు చేస్తారు. ముందస్తుగా సాగు చేసిన వరి, వేరుశనగ పంటలకు సరిపడా నీరు చెరువుల్లో లేకపోవడంతో రైతులు గంగ నీటి కోసం బెంగ పడుతున్నారు. తమిళనాడు రాష్ట్రానికి గంగ కాలువ ద్వారా నీటి సరఫరా జరిగితే కాలువ దిగువ ప్రాంతాల్లోని చెరువులకు ఊటనీరు చేరుతుంది. ఊటనీటితో పంట సాగు చేపడతారు. తెలుగుగంగ నీటి సరఫరా జరుగుతుందనే నమ్మకంతో కామనునాయుడుపేట, నరసరాజు అగ్రహారం, కొత్తమరికుప్పం, గంగులకండ్రిగ, సిత్తత్తూరి కండ్రిగ గ్రామాల్లో నార్లు పోసేందుకు దుక్కులు దున్నుతున్నారు. సత్యవేడులో ముందస్తు నార్లు పోసిన రైతులు వరి పంట సాగుచేస్తున్నారు. మండల పరిధిలో వేరుశనగ, సజ్జ పంటలు సాగు చేస్తున్నారు. కొందరుగంగ కాలువ ఊటనీటితో మరి కొందరు మోటార్ల ద్వారా, మరి కొందరు నీటిని తోడి పంటలకు సాగు నీరందించేవారు. గంగ కాలువ దిగువ ప్రాంతాలైన పాండూరు, వడ్డిపాళెం, వెంకటాపురం, పాదిరికుప్పం, రాచపాళెం, రాళ్లకుప్పం, కోమటిగుంట, శిరుణంబూదూరు, కామనునాయుడుపేట, ఎన్ఆర్ అగ్రహారం, మదనంబేడులో నారుమళ్లకు దుక్కులు దున్ని సిద్ధం చేసి, గంగ నీటి కోసం నిరీక్షిస్తున్నారు.



నీరులేని గంగ కాలువ



కామనునాయుడుపేటలో నారు మళ్లకు దున్నిన దుక్కి

| మండలం పేరు | రైతులు | కౌలు రైతులు | వరి, (హెక్టార్లలో) | వేరుశనగ (హెక్టార్లలో) | సజ్జ (హెక్టార్లలో) |
|---|---|---|---|---|---|
| సత్యవేడు | 3,888 | 37 | 286హె | 26 హె | 224హెక్టార్లు |
| బీఎన్ కండ్రిగ | 5,332 | 18 | 243 | 253 | 08 |
| వరదయ్యపాళెం | 5,100 | 58 | 31 | 98 | 07 |

**మాకు గంగ నీరే ఆధారం**



తెలుగు గంగ నీరే మాకు ఆధారం. కామనునాయుడుపేటలో నాతోపాటు నాతోటి రైతులు పది వంట సాగు చేస్తున్నారు. గత ఏడాది కూడా గంగ ఊటనీటితోనే పంటలు పండించాం. చెరువులో నీరు ప్రస్తుతం సాగు చేస్తున్న వరి పంటకు పూర్తిగా సరిపోవు. గంగ కాలువలో నీరు వస్తే పంట పండుతుంది..లేదంటే ఎండుతుంది.

–ఈ. గుణశేఖర్ కేఎన్‌పేట

### పోలేరమ్మ జాతర చాటింపు

నాగలాపురం: మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం గ్రామదేవత పోలేరమ్మ జాతర చాటింపు వేశారు. ఈ సందర్భంగా సాయంత్రం 6 గంటలకు గ్రామ పెద్దలు, మహిళలు ఆలయానికి చేరుకున్నారు. ఆలయ పూజారి సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. అనంతరం సాయంత్రం 7 గంటలకు అమ్మవారికి చాటింపు వేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ పోలేరమ్మ జాతరను పురస్కరించుకుని 7వ తేదీ గ్రామదేవత పోలేరమ్మ ఆలయంలో పొంగళ్లు పెట్టి సాయంత్రం అత్యంత వైభవంగా ఊరేగింపు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. 8వ తేదీ గురువారం ఉదయం జాతర ముగుస్తుందన్నారు.

### హెచ్ఎం సేవలు అభినందనీయం



బలరామనాయుడిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

వరదయ్యపాళెం: మండలంలోని కదూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాగాల బలరామనాయుడు సేవలు అభినందనీయమని ఉపాధ్యాయ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు తులసిరాం నాగరాజు తెలిపారు. బుధవారం ఉద్యోగ విరమణ చేసిన బలరామనాయుడుకు స్థానిక పాఠశాలలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఆయన్ని పలువురు సహచర ఉపాధ్యాయులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో ఆపస్ మండల నాయకులు సంతోష్ కుమార్, వెంకట నాయుడు, సుబ్రహ్మణ్యరెడ్డి, గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ ప్రమలత

ఏర్పేడు: మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంఈఓ ప్రేమలత అన్నారు. బుధవారం మండలంలోని అముదూరు ప్రాథమిక పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించాలన్నారు. బడీడు పిల్లలను గుర్తించి బడిలో చేర్పాలని చెప్పారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలని సూచించారు.

## పామాయిల్ సాగుతో అధిక లాభాలు



మాట్లాడుతున్న పుష్పలత

ఏర్పేడు: పామాయిల్ సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని ఉద్యానవన శాఖ శ్రీకాళహస్తి డివిజన్ అధికారి పుష్పలత అన్నారు. బుధవారం మండలంలోని మునలిపేటలో పామాయిల్ తోటల పెంపకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తోటల పెంపకానికి అయ్యే ఖర్చు మొత్తాన్ని ఉద్యానవన శాఖ చెల్లిస్తుందన్నారు. ఒక మొక్క ధర రూ.193 ఉంటుందన్నారు. ఎకరాకి 57 మొక్కలు, ఒక హెక్టారుకు 143 మొక్కలు మాత్రమే నాటాలన్నారు. మూడేళ్లకు పంట దిగుబడి ప్రారంభమై, 30 సంవత్సరాల వరకు వస్తుందన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ మేనేజర్ రాజేష్, క్లస్టర్ అధికారి గురునాథం తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సార్ మాపై దయ చూపండి



రెవెన్యూ అధికారులు తొలగించిన దుకాణం



తొలగించిన దుకాణం ముందు విలపిస్తున్న సుబ్బలక్ష్మమ్మ

- చిరు దుకాణదారుల ఆవేదన
- రోడ్డు పక్కనున్న దుకాణాలు తొలగింపు

శ్రీకాళహస్తి రూరల్: 'మేమంతా కొంతకాలంగా ఇక్కడే రోడ్డు పక్కన చిన్న దుకాణాలు పెట్టుకుని జీవనాధారం పొందుతున్నాం. ప్రస్తుతం రెవెన్యూ అధికారులు రోడ్డు పోరంబోకు స్థలంలో మీ దుకాణాలు ఉన్నాయంటూ దుకాణాలను తొలగించేందుకు చర్యలు చేపట్టారు. దీంతో మేమంతా రోడ్డున పడతాం. అయ్యా ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి సారూ మాపై దయచూపి, మేము దుకాణాలు నడుపుకునేందుకు అనుమతించండి.' అని చిరు దుకాణ వ్యాపారులు వేడుకుంటున్నారు. శ్రీకాళహస్తి మండలం ఊరందూరు పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీ ఎదుట రోడ్డు పక్కన సుమారు పది చిన్న దుకాణాలు పెట్టుకుని కొంతకాలంగా చిరు వ్యాపారాలు చేసుకుంటూ స్థానికులు జీవనం సాగిస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం రెవెన్యూ అధికారులు జేసీబీ తీసుకొచ్చి రోడ్డు పోరంబోకు స్థలంలో దుకాణాలు ఉన్నాయని తొలగించే ప్రయత్నాలు చేశారు. దుకాణదారులు అడ్డుకోవడంతో రెండు రోజుల్లో మీరే స్వచ్ఛందంగా తొలగించాలని, లేనిపక్షంలో మొత్తం నేలమట్టం చేస్తామని చెప్పి రెవెన్యూ అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో చిరు వ్యాపారులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తమ దుకాణాలను ఉన్నట్టుండి తొలగిస్తే తామంతా రోడ్డుపాలు అవుతామని దుకాణదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పక్కన ఇడ్లీ దుకాణం పెట్టుకుని జీవనం సాగిస్తున్న పంగూరు గ్రామానికి చెందిన సుబ్బలక్ష్మమ్మ దుకాణం ముందు ఉన్న పొయ్యి తొలగించి, రెండు రోజుల్లో దుకాణం ఎత్తివేయాలని లేదంటే ధ్వంసం చేస్తామని రెవెన్యూ అధికారులు హెచ్చరించారని ఆమె బోరున విలపిస్తోంది.

## భక్తులకు మెరుగైన సేవలే లక్ష్యం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పరిపాలన భవనంలో బుధవారం ఆలయాధికారులతో పలు అంశాలపై సమీక్షించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా శ్రీకాళహస్తీశ్వరాలయ ఖ్యాతిని పెంచేందుకు కృషి చేస్తామన్నారు. భక్తులకు మెరుగైన వసతులు కల్పించడంపై దృష్టి సారిస్తున్నట్టు తెలిపారు. అర్జిత సేవల్లో ఆన్‌లైన్ నుంచి వచ్చే భక్తులకు ఉచిత బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఎవరు అడ్డుకునేందుకు వీలు లేకుండా సీసీకెమెరాల పర్యవేక్షణలో అమలు చేస్తామన్నారు. ఆలాగే టికెట్ నగదు లావాదేవీలను కూడా ప్రారంభిస్తామన్నారు. ఇక విమానాశ్రయంలో శ్రీకాళహస్తికి వచ్చే భక్తుల కోసం రాహుకేతు పూజలతో పాటు దర్శనం, వసతి టికెట్లను కూడా బుక్ చేసుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆలయంలో టీటీడీ తరహాలో సెంట్రల్ ఏ సీ విధానాన్ని అమలు చేస్తామన్నారు. మహారాష్ట్ర చెందిన వెంకీస్ సంస్థ వారు సొంత నిధులతో ముక్కంటి ఆలయ పైభాగం మరమ్మతులు చేపడం సంతోషకరమన్నారు. శ్రీకాళహస్తిలో ఇతర రాష్ట్రాల భవనాలు నిర్మించేందుకు తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించామని, అందుకు వారు సానుకూలంగా స్పందించారన్నారు. ఈకార్యక్రమంలో ఈఓ ఎస్‌వీఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

### వైభవం..కుమారస్వామి కల్యాణం



కుమారస్వామివారికి హారతి ఇస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి: విజ్ఞానగిరిపై ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత కుమారస్వామి కల్యాణం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆడికృత్తిక ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం కల్యాణోత్సవం నిర్వహించారు. మొదట ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు పలు రకాల అభిషేక పూజలు చేశారు. అనంతరం వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చారణల నడుమ స్వామి అమ్మవార్ల కల్యాణం నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తు గజ వాహనంపై పురవీధుల్లో ఊరేగారు.

### పీఎంసీ ఎన్నికలకు నేడు నోటిఫికేషన్

సత్యవేడు: పాఠశాల కమిటీ ఎన్నికలకు ఈ నెల ఒకటి నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత తొలి ఎన్నికలను పాఠశాలల నుంచి నిర్వహించేందుకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో విద్యార్థుల తల్లిదండ్రులను భాగస్వాములను చేసేందుకు ఏర్పాటు చేసిన పేరెంట్ మానిటరింగ్ కమిటీ(పీఎంసీ) ఎన్నికలకు ఆగస్టు ఒకటో నోటిఫికేషన్, 8వ తేదీన ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ రవి తెలిపారు. ఆగస్టు ఒకటి నోటిఫికేషన్ అదే రోజున మధ్యాహ్నం 2గంటకు ఓటర్ల లిస్టు(తల్లిదండ్రులు)జాబితా విడుదల చేస్తారు. 5వ తేదీన ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు స్వీకరణ, అదే రోజు తుది జాబితా ప్రచురణ, రాజకీయ జోక్యం లేకుండా ఆగస్టు 8వ తేదీ 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటలోపు పీఎంసీ ఎన్నికలు నిర్వహిస్తారు. అదేరోజు మధ్యాహ్నం చైర్మన్, వైస్ చైర్మన్ ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా విద్యార్థుల తల్లిదండ్రులు సహకారాన్ని అందించాలని ఎంఈఓ కోరారు.

### వాహనచోదకులకు అవగాహన



వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని రామసేతు వంతెన వద్ద బుధవారం ఒకటో పట్టణపోలీసులు హెల్మెట్ ధారణపై వాహనచోదకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 15 సంవత్సరాల పిల్లలు ద్విచక్ర వాహనాలు నడుపుతుండడంతో వారి తల్లిదండ్రులను పిలిచి మందలించారు. మరోసారి ఇలా చేస్తే కేసులు నమోదు చేసి జరిమానా విధిస్తామన్నారు.

### పాముకాటుకు కూలీ మృతి

ఏర్పేడు: మండలంలోని అముదూరులో బుధవారం పాముకాటుకు వ్యవసాయ కూలీ మృతి చెందాడు. గ్రామస్తుల కథనం మేరకు.. మండలంలోని అముదూరు గ్రామానికి చెందిన అట్టపల్లి యల్లయ్య(54) వ్యవసాయ కూలీగా జీవిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం వ్యవసాయ పొలాల్లో కూలీ పనులు చేస్తుండగా నాగుపాము కరిచింది. దీంతో ఆయన్ను ఆస్పత్రికి తరలిస్తుండగానే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ యజమాని మృతి చెందడంతో కుటుంబం వీధిన పడింది. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి, ఆదుకోవాలని మృతుని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

### నేడు పింఛన్ల పంపిణీ

నాగలాపురం: మండలంలో 19 పంచాయతీల్లో 5,432 మంది పింఛన్‌దారులకు ఆగస్టు ఒకటో తేదీ ఉదయం 6 గంటల నుంచి సచివాలయ సిబ్బంది ద్వారా పింఛన్ పంపిణీ చేస్తామని ఎంపీడీఓ ప్రేమ్ కె బాబు తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వం ఇప్పటికే రూ.2.27,11,500 ఖాతాలో జమ చేసినట్టు ఆయన తెలిపారు. ఒకటో తేదీ తప్పిపోయిన వారికి రెండో తేదీ ఇంటి వద్దకే వచ్చి పింఛన్ అందజేస్తామన్నారు.

### సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

బుచ్చినాయుడుకండ్రిగ: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు సూచించారు. బుచ్చినాయుడుకండ్రిగలోని నెంబాయి జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలుషిత ఆహార పదార్థాలు, తాగునీటితోనే దయేరియా వ్యాధి చెందుతుందని, అప్రమత్తంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. దోమకాటుతో విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు ఇంటి ఆవరణలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. వైద్యుల సలహాలు పాటిస్తే సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, డయేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులు సోకకుండా నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

## స్కీమ్ వర్కర్లపై వేధింపులు మానుకోవాలి



నిరసన తెలుపుతున్న స్కీమ్ వర్కర్లు

శ్రీకాళహస్తి: 'అధికార పార్టీ నేతలు, ప్రభుత్వం మాపై వేధింపులు మానుకోవాలి.. లేదంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం.. మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్లు ముట్టడిస్తాం' అని స్కీమ్ వర్కర్లు హెచ్చరించారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం వద్ద సీఐటీయూ అనుబంధ సంఘాల స్కీమ్ వర్కర్లు బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వాణిశ్రీ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినప్పుడల్లా చిరుద్యోగులను రాజకీయ వేధింపులకు గురిచేయడం తగదన్నారు. ముఖ్యంగా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అధికార పార్టీ నేతలు స్కీమ్ వర్కర్లను వేధింపులకు గురి చేస్తున్నారని, వారికి సంబంధిత శాఖల ఉన్నతాధికారులు సహకరించడం సిగ్గుచేటన్నారు. ఐదేళ్ల శ్రీకాళహస్తి మండలంలోని మన్నవరం, ఎంపేడు అంగన్‌వాడీ కార్యకర్తలు స్థానిక అధికార పార్టీ నేతల వేధింపులు తాళలేక ఆస్పత్రి పాలైతే శ్రీకాళహస్తి సీడీపీఓ పరామర్శించిన పాపాన పోలేదని విమర్శించారు. ఇలాగైతే సీడీపీఓ దిష్టిబొమ్మ దహనం చేస్తామన్నారు. ఐదేళ్లుగా ఈ అంగన్‌వాడీ కార్యకర్తలు జోలికొస్తే ఎవరైనా ఊరుకోం. ... లేదని, వారి ఆందు చూస్తామని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత శ్రీకాళహస్తి నియోజకవర్గంలో స్కీమ్ వర్కర్లపై పెద్ద ఎత్తున రాజకీయ వేధింపులు మొదలయ్యాయని వాపోయారు. స్థానిక ఎమ్మెల్యే తెలిసినా మౌనం వహిస్తున్నారా? అంటూ ప్రశ్నించారు. ఇకనైనా ఎమ్మెల్యే స్పందించి స్కీమ్ వర్కర్లపై వేధింపులను అడ్డుకట్ట వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య, ఆశా వర్కర్ల జిల్లా గౌరవాధ్యక్షురాలు లక్ష్మి, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ధనమ్మ, భాగ్యలక్ష్మి, రేవతి, సౌజన్య, రాజ్యలక్ష్మి, చారు లత, హరినాథ్, రంగయ్య, సంక్రాంతి వెంకటయ్య, నాగరాజు, వెంకటేష్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యం, విద్య అందరికీ తప్పనిసరి



మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్

శ్రీకాళహస్తి: ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం, విద్య తప్పనిసరి శ్రీకాళహస్తి సీనియర్ సివిల్ జడ్జి, 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్ అన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు పట్టణంలోని తుపాన్ సెంటర్ వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్ ప్రారంభించారు. పలువురు ప్రజలు వైద్యపరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ గిరిజనులకు హక్కుల పరిరక్షణపై అవగాహన కల్పించారు. ప్రతి ఇంట్లో ఆరోగ్యం, విద్య తప్పనిసరిగా ఉండాలన్నారు. మన విద్య సంస్థాగాన్ని కాపాడుతుందన్నారు. ఏదైనా సమస్య ఉంటే ఉచిత సేవాధికార సంస్థను సంప్రదించి న్యాయ సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, కోర్టు సిబ్బంది, శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

## వేడుకగా తిరువాడిపుర ఉత్సవం



తిరుచ్చి వాహనంపై ఆండాళ్ అమ్మవారు

నారాయణవనం: స్థానిక పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆండాళ్ తిరువాడిపుర ఉత్సవం వేడుకగా నిర్వహించారు. ఉత్సవంలో భాగంగా బుధవారం సాయంత్రం తిరుచ్చి వాహనాన్ని అధిరోహించిన ఆండాళ్ అమ్మవారు మాడవీధుల్లో విహరించారు. ఉదయం సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచి అర్చకులు నిత్యపూజా కార్యక్రమాలను పూర్తి చేశారు. తిరువాడిపుర ఉత్సవాల సందర్భంగా ఆండాళ్ అమ్మవారు(గోదాదేవి)కి అభిషేకం, అర్చనలను చేశారు. సాయంత్రం తిరుచ్చి వాహనాన్ని అధిరోహించిన అమ్మవారు మాడవీధుల్లో విహరిస్తూ భక్తుల కర్పూర హారతులు అందుకున్నారు. ఆలయానికి చేరుకున్న అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, దూప, దీప నైవేద్యాలను సమర్పించారు. పైకార్యక్రమాలను ఆలయ అధికారి భరత్, ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్యులు, శ్రీనివాసభట్టాచార్యులు తదితరులు పర్యవేక్షించారు.

### బాలిక అదృశ్యంపై కేసు నమోదు

ఏర్పేడు: మండలంలోని నరస్వామికండ్రిగలో ఓ బాలిక అదృశ్యంపై కేసు నమోదైనట్టు ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులు బుధవారం రాత్రి తెలిపారు. నరస్వామికండ్రిగ గ్రామానికి చెందిన (16) బాలిక మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి, నిద్రించింది. బుధవారం ఉదయం బాలిక కనిపించకపోవడంతో తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ చెప్పారు.

### చికిత్స పొందుతూ కార్మికురాలి మృతి

ఏర్పేడు: మండలంలోని విక్రమమాల టీసీఎల్ పనిచేస్తున్న ఓ కార్మికురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. సీఐ కథనం మేరకు.. మండలంలోని మునగలపాళెం గ్రామానికి చెందిన గౌతమి(45) విక్రమమాల టీసీఎల్ కంపెనీలో కార్మికురాలిగా పనిచేస్తోంది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి విధులు నిర్వహిస్తూ విషపు గుళికలు తిని ఆత్మ హత్యాయత్నానికి పాల్పడింది. తోటి కార్మికులు గుర్తించి రేణిగుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. పోస్టుమార్టం కోసం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.